క్లుప్తంగా

గౌరవ వేతనం కోసం వినతి



ఎంపీడీవో సీతామహాలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ అనూషదేవి,ఎంపీటీసీలు

చింతపల్లి: మండలంలో ఎంపీటీసీ సభ్యులకు వేతనాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కోరాబు అనూషదేవి కోరారు. ఈ మేరకు ఆమె పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి గురువారం ఎంపీడీవో సీతామహాలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడిచిన మూడేళ్లుగా ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనం విడుదల చేయలేదన్నారు. దీంతో మండల సమావేశాలకు హాజరుకావడానికి కూడా వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరో ఏడాది కాలంలో తమ పదవీ కాలం ముగుస్తుందని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు అందజేయవలసిన గౌరవ వేతనాన్ని విడుదల చేయాలిని కోరారు. వైస్ ఎంపీపీలు శారద, వెంగళరావు, ఎంపీటీసీ సభ్యులున్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

గూడెంకొత్తవీధి: పరిశరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు సూచించారు.మండలంలోని దామణపల్లిలో గురువారం నిర్వహించిన శానిటేషన్ డ్రైవ్‌ను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపాలని సిబ్బందికి సూచించారు. పరిసరాలు పరిశుభ్రతంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, బ్లీచింగ్ వేయాలని, దోమతెరలు వినియోగించాలని సూచించారు. దీంతో దోమలు దరిచేరవన్నారు. ఇక్కడ జరుగుతున్న హార్టికల్చర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. పండ్ల తోటల పెంపుతో ఆదాయం పొందవచ్చని ఆయన రైతులకు సూచించారు.

మధ్యవర్తిత్వంతో ప్రయోజనాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేజిస్ట్రేట్ మురళీ గంగాధరరావు

రంపచోడవరం: స్టేట్ లీగల్ సర్వీసెస్ ఆథారిటీ ఆదేశాలతో రంపచోడవరం మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో గురువారం మీడియేషన్ ఫర్ ద నేషన్ వన్ వీక్ అవేర్‌నేస్ క్యాంపెయిన్ కార్యక్రమం జరిగింది. న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.మురళీ గంగాధరరావు మాట్లాడుతూ మీడియేషన్ ఆఫ్ నేషన్ అనే నినాదంతో మధ్యవర్తిత్వం ప్రయోజనాలను తెలిపారు. మధ్యవర్తిత్వం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులకు బ్యాంకు వారికి ఓరియేంటేషన్ కార్యక్రమం జరిగింది. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ.ఆర్.ఆర్.భగవాన్, వై.శ్రీనివాసరావు, చుక్కా సంతోష్‌కుమార్, ఎండీ జిలానీ, డి.లక్ష్మీనారాయణ, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

బోరు బాగు చేయరూ..



నిరుపయోగంగా ఉన్న తాగునీటి బోరు

పాడేరు రూరల్: మండలంలో గుత్తులపుట్టు పంచాయతీ కేంద్రంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో తాగునీరు సమస్య తీవ్రంగా మారిందని అంగన్‌వాడీ కార్యకర్త వెంకటరవణమ్మ, ఆయా చిన్నతల్లిలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో సుమారు 30 మంది చిన్నారులతో పాటు బాలింతలు, గర్భిణులున్నట్టు చెప్పారు. తాగునీరు, రన్నింగ్ వాటర్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు స్పందించి బోరు మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు.

మత్తుపదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు



దుకాణంలో సోదాలు చేస్తున్న పోలీసులు

ఎటపాక: దుకాణాల్లో మత్తుపదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎటపాక సీఐ కన్నపరాజు హెచ్చరించారు. మండలంలోని నెల్లిపాక, నల్లకుంట గ్రామాల్లో పాఠశాలల సమీపంలో ఉన్న పాన్, కిరణా దుకాణాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలకు వంద మీటర్ల పరిధిలోని కిరాణా, పాన్ షాపుల్లో గుట్కాలు, ఖైనీలు, మద్యం, సిగరెట్, ఇతర పొగాకు తదితర ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఐ అప్పలరాజు, సిబ్బంది ఉన్నారు.



ఉపాధ్యాయులను నియమించి పాఠశాల తెరవాలని కోరుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

బడికి దూరం.. గిరిజన బాల్యం

- తెరుచుకోని పాఠశాలలు
- మండలంలో 14 పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత
- పిల్లల భవిష్యత్‌పై విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన
- పట్టించుకోని యంత్రాంగం

పెదబయలు: ప్రతి విద్యార్థికి ప్రాథమిక విద్యతో పాటు పౌష్టికాహారం అందిస్తామని, పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలని కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయి. వేసవి సెలవులు పూర్తయినా మండలంలో పలు పాఠశాలలు నేటికీ తెరుచుకోలేదు. నెల రోజులు కావస్తున్నా ఉపాధ్యాయులు రాక బడులు మూత బడి ఉన్నాయి.

చదువుకు దూరమవుతున్న విద్యార్థులు

పాఠశాలలు గత నెల 12న పునః ప్రారంభం జరిగి నెల రోజులు కావస్తున్నా ఉపాధ్యాయులను ప్రభుత్వం,అధికారులు నియామకం చేయకపోవడంతో ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. ఈ పాఠశాలల్లో పనిచేసిన సీఆర్‌టీలు, ఉపాధ్యాయులు ఇటీవల జరిగిన ఉపాధ్యాయ కౌన్సిలింగ్‌లో బదిలీపై వేరే ప్రాంతాలకు వెళ్లారు. దీంతో మండలంలో 14 జీపీఎస్ పాఠశాలలు మూతపడ్డాయి. నిబంధన ప్రకారం ఏకోపాధ్యాయులు ఉన్న పాఠశాలలో రీలివర్ రాకుండా బదిలీ చేయడానికి వీలు లేదు. అయిన బదిలీకు ప్రభుత్వం అవకాశం ఇవ్వడంతో ఇక్కడ పని చేసే ఉపాధ్యాయులు వేరు చోటకు వెళ్లిపోయారు. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల స్థానంలో వేరే వారిని నియమించాల్సి ఉన్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. పిల్లలను ఇంట్లో ఉంచలేక, బడికి పంపాడానికి వీలులేక అవస్థలు పడుతున్నామని విద్యార్థుల తల్లితండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు బడికి పూర్తిగా దూరం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్టు తల్లితండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటి వరకు ఉపాధ్యాయులు లేని కారణంగా ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ జరిగిన బ్యాగ్, యూనిఫాం,బెల్టు ఇతర కిట్టు సామాగ్రి అందడం లేదనివారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బడికి తాళాలు

అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం మారుమూల ఇంజరి, జామిగుడ, గిన్నెలకోట, బొంగరం పంచాయతీల్లో ఉన్న జీపీఎస్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేని కారణంగా బడుల తాళాలు తెరుచుకోలేదు. ఇంజరి పంచాయతీ పరిధిలో ఇంజరి, గిన్నెగరువు, తల్లాబు జీపీఎస్ పాఠశాలలు, జామిగుడ పంచాయతీ కొజ్జరిగుడ, గుంజివాడ, తారాబు, గిన్నెలకోట పంచాయతీలో గిన్నెలకోట, ఇనుపతీగలు, చింతగరువు, బొంగరం పంచాయతీ కుంబుర్ల, బొంగరం, నిట్టాపుట్టు, వంచుర్బ పాఠశాలలు నేటి వరకు ఉపాధ్యాయులు లేక మూతపడి ఉన్నాయి.

పాఠశాల తెరిపించాలి



జామిగుడ పంచాయతీ తారాబు జీపీఎస్ పాఠశాలలో 40 మంది విద్యార్థులు ఉన్నారు. వేసవి సెలవుల తరువాత బడి తెరుచుకోలేదు. గతంలో ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లారు. ఉపాధ్యాయులు వస్తారని నెల రోజుల నుంచి ఎదురు చూస్తున్న రావడం లేదు. ఉపాధ్యాయులను నియమించాలని అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందించడం లేదు, దీంతో మా పిల్లలు చదువుకు దూరం అయ్యే ప్రమాదం ఉంది. **కలెక్టర్ దినేష్‌కుమార్, ఉన్నతాధికారులు స్పందించి ఉపాధ్యాయులు లేక మూడపడిన పాఠశాలలు తెరిపించి విద్యార్థులు డ్రాపౌట్స్ కాకుండా చర్యలు తీసుకోవాలి.**

-- వడేలు అప్పన్నదొర,
విద్యార్థి తండ్రి, తారాబు గ్రామం,
పెదబయలు మండలం

సమస్యను నివేదించాం

మండలంలో 68 జీపీఎస్ పాఠశాలలకు గాను నాలుగు గ్రామ పంచాయతీల పరిధిలో 14 పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయులు వేర్వేరు ప్రాంతాలకు వెళ్లడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. ఈ విషయాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో విద్యాశాఖ అధికారులకు నివేదించడం జరిగింది. వేరే ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై వేయాలన్నా ఈ పంచాయతీ పాఠశాలల్లో సింగిల్ ఉపాధ్యాయులు ఉండడం వల్ల అదనపు బాధ్యతలు ఇవ్వడానికి ఇబ్బంది అవుతోంది. ఉన్నతాధికారుల సూచనల మేరకు

-- పుష్ప జోసెఫ్, మండల విద్యాశాఖ **అధికారి,** పెదబయలు మండలం.



మూతపడి ఉన్న బొంగరం జీపీఎస్ పాఠశాలను పరిశీలిస్తున్న స్థానికులు

పక్కాగా ఓటరు నమోదు



బీఎల్‌వోలకు శిక్షణ ఇస్తున్న డివిజన్ శిక్షకులు ప్రవీణ్ పడాల్

చింతపల్లి: మండలంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టాలని డివిజన్ కో-ఆర్డినేటర్ టి.ప్రవీణ్ పడాల్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బూత్‌స్థాయి అధికారులకు గురువారం ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గల అన్ని పంచాయతీల్లోని వార్డుల్లో పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల నమోదును చేపట్టాలన్నారు. గ్రామాల్లో వలసలు, మృతులను గుర్తించడంతో పాటు కొత్త ఓటర్ల నమోదు, ఓటరు చిరునామా మార్పులు వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఎన్నికలు డీటీ లక్ష్మణమూర్తి, సీనియర్ అసిసెంట్లు మోహనరావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

విరబూసిన బ్రహ్మకమలాలు



పాడేరులో విరబూసిన బ్రహ్మకమలాలు

పాడేరు : పాడేరు పట్టణంలోని సమాచార , పౌర సంబంధాల శాఖలో డివిజనల్ పౌర సంబంధాల అధికారి పి.రాములు ఇంటి పెరట్లో గురువారం రాత్రి బ్రహ్మ కమలాలు విరబూశాయి. నాలుగేళ్ల క్రితం విజయనగరంలోని ఓ స్నేహితుడి ఇంటి నుంచి మొక్కను తెచ్చి పెరట్లో వేశామని, ఏటా బ్రహ్మ కమలాలు విరబూస్తునే ఉన్నాయన ఆయన చెప్పారు.విరబూసిన బ్రహ్మ కమలాలు అందర్ని విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

గర్భిణులకు వైద్య పరీక్షలు



వై.రామవరం సీహెచ్‌సీలో గర్భిణులకు స్కానింగ్ చేస్తున్న వైద్యులు

వై.రామవరం: పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో భాగంగా స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గురువారం సుమారు 84 మంది గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో గర్భిణులకు స్కానింగ్‌లు, రక్తపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. వారిలో 16 మంది హైరిస్క్ గర్భిణులను గుర్తించి ఆస్పత్రిలో చేర్పించారు. వారికి ప్రత్యేక వైద్య సేవలతోపాటు, అవస రమైన మందులను అందించారు. ఈ వైద్య శిబిరానికి హాజరైన గర్భిణులందరికి భోజన వసతి, రవాణా సౌకర్యాలు కల్పించారు. గైనకాలజిస్టు డాక్టర్ మోమిన, సీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.మండలంలోని చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో వైద్యాధికారులు నరేంద్ర, దినేష్‌ల ఆధ్వర్యంలో గర్భిణులకు స్కానింగులు, ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహించారు.

చింతపల్లి: పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో గురువారం 190 మంది గర్భిణులకు స్కానింగ్‌లు, వైద్య పరీక్షలు చేశారు. స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.వాసవి మాట్లాడుతూ ఆస్పత్రిలోనే గర్భిణులు ప్రసవం పొందడం ద్వారా తల్లిబిడ్డల ఆరోగ్యం సురక్షితంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు విధిగా ఒక్కసారైనా అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేసుకోవాలని సూచించారు. ఈ స్కానింగ్ ద్వారా ప్రసవానికి ముందగా బిడ్డ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవచ్చన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకుని మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. వైద్యాధికారులు సూచించిన ప్రసవ సమయానికి పదిరోజులు ముందుగానే గర్భిణులు వసతి గృహంలో చేర్పించాలన్నారు. ఈ అవకాశాన్ని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆస్పత్రి సూపరింటిండెంట్ ఇందిరా ప్రియాంక పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

గంగవరం : ఎంపీపీ పలాల కృష్ణారెడ్డి అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం 11 గంటలకు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వై.లక్ష్మణరావు తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, మండల పరిషత్ సభ్యులు, సర్పంచ్‌లు ప్రజాప్రతినిధులు విధిగా హాజరుకావాలన్నారు. ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలన్నారు.

ఖాళీ సీట్ల భర్తీకి చర్యలు

కొయ్యూరు: స్థానిక బాలుర గురుకుల జూనియర్ కళాశాలలో విద్యా సంవత్సరం నుంచి ఎంఈసీ గ్రూపును పునరుద్ధరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సీహెచ్. లక్ష్మణ్ తెలిపారు. పేరెంట్స్ డే సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 40 సీట్లు ఎంఈసీ గ్రూపులో ఉన్నాయన్నారు. ఈనెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.ఎస్సీ, బీసీ, ఓసీలకు ఒక్కో సీటు కేటాయించారన్నారు. ఎంపీపీ బడుగు రమేష్, జడ్పీటీసీ వారా నూకరాజు, చీడిపాలెం సర్పంచ్ సోమన్నదొర, ఎంపీటీసీ సభ్యులు గంగాభవానీ తదితరులు పాల్గొన్నట్టు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు



ముంచంగిపుట్టులో సాయిబాబా మందిరంలో భక్తులు



పవనగిరి క్షేత్రంలో తణుకు వెంకటరామయ్య విజయలక్ష్మి దంపతులను సత్కరిస్తున్న భక్తులు



పాడేరులో పూజలు చేస్తున్న భక్తులు



రాజవొమ్మంగిలో సాయిబాబాకు క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

సాక్షి, పాడేరు/ముంచంగిపుట్టు/జి.మాడుగుల/కొయ్యూరు/చింతపల్లి/అడ్డతీగల/రాజవొమ్మంగి/గంగవరం/చింతూరు: గురుపౌర్ణమి వేడుకలను జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో గురువారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా సాయిబాబా మందిరాలకు తెల్లవారు జాము నుంచి భక్తులు తరలివచ్చారు. సాయిబాబాను ప్రత్యేకంగా అలంకిరంచారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు హోమం చేశారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం బాబా వారి పల్లకి సేవ నిర్వహించారు. రాత్రి భజన కార్యక్రమం జరిగింది.పాడేరులోమోదకొండమ్మతల్లి ఆలయ కమిటీ ప్రధాన కార్యదరి కోటిబాబునాయుడు పాల్గొన్నారు. ముంచంగిపుట్టులో పాడేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ గాయత్రి, ఎంపీటీసీ విజయకుమారి, భక్తులు పాల్గొన్నారు. కొయ్యూరులో కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, కళ్యాణం పాల్గొన్నారు. అడ్డతీగలలో తణుకు వెంకటరామయ్య, విజయలక్ష్మి ఆధ్వర్యంలో సదానంద సరస్వతి స్వామీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు గావించారు. రాజవొమ్మంగిలోని లింగేశ్వరరావు, నాగలక్ష్మి పాల్గొన్నారు. గంగవరంలో రామకృష్ణ ప్రసాద్, నీలాలమ్మ, శ్రీను పాల్గొన్నారు. చింతూరులో పోతురాజు, నాగేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.



చింతూరులో పూజలు చేస్తున్న భక్తులు



గంగవరంలో అర్చకుడు ప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే విద్యాభివృద్ధి సాధ్యం



జాముగుడలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి పీవో అభిషేక్ గౌడ



రవ్వలగుడలో పేరెంట్స్, అధికారులతో అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్



ముంచంగిపుట్టు ఏకలవ్య పాఠశాలలో తల్లుల కాళ్లకు వందనం చేస్తున్న విద్యార్థులు



రంపచోడవరంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ కల్పశ్రీ, వేదికపై డీఎస్పీ సాయిప్రశాంత్



రాజవొమ్మంగిలోని కార్యక్రమంలో పాల్గొన్న ఐటీడీఏ పీవో సింహాచలం, ఎమ్మెల్యే శిరీషాదేవి



చింతలవీధిలో భోజనాలు వడ్డిస్తున్న సర్పంచ్ వంతాల సీతమ్మ, హెచ్ఎం వెంకటరమణ

డుంబ్రిగుడ: తల్లిదండ్రులు భాగస్వామ్యమవుతేనే విద్యాభివృద్ధి సాధ్యపడుతుందని పాడేరు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అభిషేక్ గౌడ విద్యార్థుల తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. మండలంలోని కొర్రాయి పంచాయతీ జాముగుడ బాలికల ఆశ్రమ పాఠశాలలో గురువారం జరిగిన తల్లిదండ్రుల - ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సీఐ హిమగిరి, ప్రిన్సిపాల్ ఎం.వి.ఎస్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయటౌన్: మండలంలోని రవ్వలగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన పేరెంట్స్ సమావేశానికి అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్ హాజరయ్యారు. విద్యార్థులకు హెల్త్‌కార్డులు అందజేశారు.ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఎంఈవో వంతాల త్రినాథరావు, హెచ్ఎం టి.నాగేశ్వరరావు, ఏటిడబ్ల్యూవో వెంకటరమణ, కొత్తభల్లుగుడలో ఎంఈఓ-2 భారతీ రత్నం, బోసుబెడలో హెచ్ఎం నన్నారావు, కంఠబొంఘుగుడలో సర్వశిక్ష అభియాన్ ఏఎంవో కె.భాస్కర్‌రావు, హెచ్ఎం మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన పేరెంట్స్ డే కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కల్పశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యానికి నిర్దేశించుకొని వాటిని సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఉత్తమ విద్యార్థులకు సబ్ కలెక్టర్ కల్పశ్రీ, డీఎస్పీ సాయి ప్రశాంత్‌లు మెమోంటోలు అందజేసి, సత్కరించారు. సర్పంచ్ బొజ్జయ్య, విద్యా కమిటీ చైర్మన్ సుందర్‌సింగ్, వైస్ చైర్మన్ ప్రవంతి, లెనోనా విద్యా సంస్థల అధినేత ఇందిర పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాలలో జరిగిన పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు అన్ని విధాలుగా అండగా నిలవాలన్నారు. ఎమ్మెల్యే శిరీషాదేవి విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, సర్పంచ్ గొల్లపూడి రమణి, జెడ్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి, ఎంపీటీసీ సభ్యుడు గొల్లపూడి పెద్దిరాజు పాల్గొన్నారు.

సాక్షి, పాడేరు/ ముంచంగిపుట్టు/ గూడెంకొత్తవీధి/ కొయ్యూరు/ చింతపల్లి/ అడ్డతీగల/ వై.రామవరం/ గంగవరం/ కూనవరం/ వి.ఆర్.పురం/జి.మాడుగుల: జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, గురుకుల విద్యాలయాలు, కేజీబీవీలు, జూనియర్ కళాశాలల్లో గురువారం తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాలు జరిగాయి. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులను ఘనంగా స్వాగతం పలికారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. చింతలవీధిలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ సీతమ్మ, హెచ్ఎం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. ముంచంగిపుట్టులో ఎంపీపీ అరిసెల సీతమ్మ, ఎంపీడీవో సూర్యనారాయణ మూర్తి, ఎంఈవో కృష్ణమూర్తి, ఎస్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. గూడెంకొత్తవీధిలో సీఐ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కొయ్యూరులో ఎంపీడీవో ప్రసాద్, ఏటీడబ్ల్యూవో క్రాంతి కుమార్, ఎంఈవో రాంబాబు, సర్పంచ్ సింహాచలం, ఎస్వో పరిమళ, హెచ్ఎం గోపాల్ తదితరులు పాల్గొన్నారు. చింతపల్లిలో ఎస్ఐ వెంకటేశ్వరరావు హెచ్ఎంలు య.నర్సింగరావు, బి సత్యనారాయణరాజు,రామరాజుపడాల్ తదితరులు పాల్గొన్నారు. అడ్డతీగలలో ఎంపీడీవో కె.ఆర్.విజయ , ఎంఈవో పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. వై.రామవరంలో ఎంపీడీవో కె.బాపన్నదొర తదితరులు పాల్గొన్నారు.గంగవరంతో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు బేబీ రత్నం, వైస్.ఎంపీపీ గంగాదేవి, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో లక్ష్మణరావు, ఎస్ఐ వెంకటేష్, మాజీ ఎంపీపీ ప్రభ, హెచ్‌ఎంలు సత్యమూర్తి, వరలక్ష్మి, శ్రీరామ్మూర్తి, చిన్నారెడ్డి, నాయకులు బుల్లియమ్మ, ఎస్ఎంసీ చైర్మన్లు రాజ్యలక్ష్మి, సీతమ్మ, వైస్ చైర్మన్లు నాగమహేష్, వెంకటరమణ, సత్యవేణి తదితరలు పాల్గొన్నారు. కూనవరంలో జెడ్పీటీసీ సభ్యురాలు గుజ్జా విజయ, సర్పంచ్ కారం పార్వతి, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. వి.ఆర్.పురంలో ఎస్ఐ సంతోష్ కుమార్, తహసీల్దార్ సరస్వతి ఎస్ఐ సంతోష్ కుమార్, హెచ్‌ఎంలు బొర్ర రమేష్, నాగమణి తదితరులు పాల్గొన్నారు. జి.మాడుగులలో హెచ్ఎం మత్స్యరాస మత్స్యరాజు, కెజీబీవీ ప్రత్యేక అధికారి పద్మ, డ్వామా పీడీ విద్యాసాగర్ తహసీల్దార్ రాజ్ కుమార్, ఎంపీడీవో డేవిడ్‌రాజ్, ఎస్ఐ షణ్ముఖరావు, ట్రినీ ఎస్ఐ సాయిరామ్ పడాల్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ, ఎంపీటీసీ విజయకుమారి, సర్పంచ్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో వెల్లువెత్తిన సమస్యలు



గోమంగి పాఠశాలలో సమస్యలపై హెచ్‌ఎంకు వినతిపత్రం అందజేస్తున్న తల్లిదండ్రులు



సీలేరులో మాట్లాడుతున్న సర్పంచ్ కమల

పెదబయలు: జిల్లా వ్యాప్తంగా గురువారం జరిగిన పేరెంట్స్ -టీచర్స్ మీటింగ్‌లో పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై విద్యార్థుల తల్లిదండ్రులు ధ్వజమెత్తారు. ఇందులో భాగంగా పెదబయలు మండలంలోని గోమంగి, సీతగుంట పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, వసతిగృహం నిర్మించాలని, పాఠశాలలను అప్‌గ్రేడ్ చేయాలని, మరుగుదొడ్లు శుభ్రంగా లేవని, అదనపు మరుగుదొడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ముంచంగిపుట్టు ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాల పెదబయలు వైటీసీలో గత 12 ఏళ్ల నుంచి కొనసాగుతుందిన, ముంచంగిపుట్టు లబ్బూరులో పాఠశాల భవనం నిర్మించి తరలించాలని కోరారు. సమస్యలపై ఎందుకు స్పందించడం లేదని హెచ్‌ఎంలను, యాజమాన్య కమిటీ ప్రతినిధులను నిలదీశారు.వైఎస్సార్ సీపీ నాయకుడు డాక్టర్ తెడబారికి సురేష్‌కుమార్ పలు సూచనలిచ్చారు. ప్రిన్సిపాళ్లు వసంతకుమారి, సుమన్, వైస్ ప్రిన్సిపాల్ పర్వతాలు, ఎంపీటీసీ సభ్యులు కృష్ణారావు, మాధవరావు

సీలేరు: గుమ్మిరేవులు, కాకనూరు పాఠశాలల్లో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కమల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి విద్యావ్యవస్థ మారుస్తాం అని చెప్పి టీచర్స్ లేని మెగా పేరెంట్స్ మీటింగ్‌కి లక్షలాది రూపాయలు వెచ్చించడం దారుణమన్నారు. ప్రత్యేక డీఎస్సీ ద్వారా గిరిజన అభ్యర్థులకు ఉపాధి కల్పించాలన్నారు. పాఠశాలల్లో టీచర్ల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

రాజవొమ్మంగి: స్థానిక ఏకలవ్య రెసిడెన్షియల్ మోడల్ స్కూల్లో జరిగిన కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ లోసుల రాజుబాబు ఆధ్వర్యంలో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం తాగునీరు పరిశుభ్రంగా లేదంటూ అసహనం వ్యక్తం చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా లేవంటూ ఏకరవు పెట్టారు. అదే సమయంలో రాజవొమ్మంగి వచ్చిన ఐటీడీఏ పీఓ కట్టా సింహాచలం, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి విషయం తెలిసి వెంటనే ఏకలవ్య పాఠశాలకు వెళ్లారు. పాఠశాల యాజమాన్యంపై పేరెంట్స్ ఆరోపణలపై ఆరా తీశారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై స్థానిక ఎంపీవో, తహసీల్దార్‌లను విచారణాధికారులుగా నియమిస్తున్నామని, నాలుగు రోజుల్లో సమస్యలన్నిటిని పరిష్కరిస్తామని పీఓ విద్యార్థుల తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు.ప్రిన్సిపాల్ ఎం.వి.కృష్ణారావు తదతరులు పాల్గొన్నారు.